క్లుప్తంగా

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మాగనూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్, ఆర్‌ఐ శ్రీశైలం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

కళ్లపై ప్రత్యేక శ్రద్ధ

మాగనూర్: కళ్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారి రంజిత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచితంగా పరీక్షలు, అద్దాలు, అవసరమైన ఆపరేషన్ చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, వైద్య సిబ్బంది శారద, ఐ డాక్టర్ భానుప్రసాద్, ఆశ కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మైలార్‌లింగేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన

కృష్ణా: మండలంలోని చేగుంటలో నూతన మైలార్‌లింగేశ్వర విగ్రహాన్ని భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠించారు. సోమవారం బాడియాల్ మూలేమఠం పీఠాధిపతి చెన్నవీర శివాచార్య మహాస్వామి, క్షీరలింగా మహాస్వాముల ఆధ్వర్యంలో విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. అంతకు ముందు ఆలయంలో రుద్రాభిషేకం, మహా మంగళహారతి వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కొండ్రోన్‌పల్లికి బస్సును పునరుద్ధరించండి

ధన్వాడ: మండలంలోని గోటూర్, కొండ్రోన్‌పల్లి మీదుగా మహబూబ్‌నగర్ వెళ్లే బస్సును మూడు నెలల క్రితం నిలిపివేశారని, వెంటనే పునరుద్ధరించాలని సోమవారం కలెక్టరేట్‌లో సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఇసుక ట్రాక్టర్లు అధిక సంఖ్యలో నడిపి బీటీ రోడ్డును కంకర తేలేలా తయారు చేశారన్నారు. అధికారులు స్పందించి బీటీ వేసి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేష్, బాను, బాలస్వామి, కతలప్ప, రాములు, బాల్‌రాజు తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు దుస్తులు అందజేత

ధన్వాడ: మండలానికి చెందిన కబడ్డీ క్రీడాకారులకు బుడ్డమర్రితండా సర్పంచ్ పూర్యనాయక్ క్రీడా దుస్తులను అందజేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో సీఎం కప్ పోటీలలో క్రీడాకారులకు అందజేసినట్లు పీఈటీ రవికుమార్ తెలిపారు.

గుండెపోటుతో యువకుడి మృతి

మక్తల్: గుండెపోటుతో యువకుడి మృతి చెందిన ఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. మీ సేవ నిర్వాహకుడు తఖీ బాబా(35) కాలకృత్యాలు చేసుకుంటుండగా అకస్మాత్తుగా కుప్పకూలాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు.

రైతుబంధు కంటే కేంద్రం ఇచ్చే సబ్సిడీ ఎక్కువ

నారాయణపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకుంటున్న రైతుబంధు కంటే కేంద్రం ఎరువులుపై ఇస్తున్న సబ్సిడీలు ఎక్కువని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీ, పంట బీమా కోసం ఫసల్ యోజన, గిట్టుబాటు ధర, మద్దతు ధరలు కల్పిస్తుందన్నారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూ పంట నష్టపోయిన రైతులకు రూ.10 వేల పరిహారం ఇస్తామని ప్రకటించి, ఇంత వరకు నయాపైసా ఇవ్వలేదన్నారు.

వేసవి శిబిరాలను వినియోగించుకోండి



మరికల్: కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్న వేసవి శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంపీఓ బాలాజీ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో వేసవి శిబిరాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. చిన్నారులు వేసిన డ్రాయింగ్‌లను చూశారు. 20 రోజుల పాటు నిర్వహించే శిబిరాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పిస్తే వారికి చిత్రలేఖనంతో పాటు ప్రాథమిక విద్య అందించనున్నట్లు తెలిపారు.

చదువుతో పాటు క్రీడలకు గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ వనజ

నారాయణపేట రూరల్: తెలంగాణ ప్రభుత్వం చదువుతో పాటు ఆటలకు తగిన ప్రాధాన్యత ఇస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని జెడ్పీ చైర్మన్ వనజమ్మ అన్నారు. స్థానిక మినీ స్టేడియం గ్రౌండ్‌లో సోమవారం ప్రారంభమైన సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలకు ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ మయాంక్‌మిట్టల్, ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లుతో కలిసి పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోటీలు ప్రారంభించారు. గ్రామీణ విద్యార్థుల ప్రోత్సాహానికి సీఎం కప్ పోటీలను నిర్వహిస్తున్నామని, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, మార్కెట్ చైర్‌పర్సన్లు గందే అనసూయ, జ్యోతి, జీపీడీఓ పద్మనళిని, డీవైఎస్‌ఓ కృష్ణమాచారి, పీఈటీలు గోపాలం, రమణ, సాయినాథ్ పాల్గొన్నారు.



బాలుర కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్

దళిత ఆత్మగౌరవ పతాక భాగ్యరెడ్డివర్మ



చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట: అణగారిని వర్గాలకు మెరుగైన విద్యను అందించి విద్యా విప్లవం సృష్టించిన దళిత ఆత్మగౌరవ పతాక డాక్టర్ భాగ్యరెడ్డి వర్మ అని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో డాక్టర్ భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా చిత్ర పటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వారి స్ఫూర్తితో హైదరాబాద్ నగరంలో భాగ్యరెడ్డి వర్మ పాఠశాలను ప్రారంభించి చదువును అందించారన్నారు. బౌద్ధ సాంస్కృతిక ఉద్యమాన్ని కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. ప్రభుత్వం భాగ్యరెడ్డి వర్మ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో కన్యాకుమారి, నర్సింగ్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా రహీం



నియామక పత్రాన్ని అందుకుంటున్న అబ్దుల్ రహీం

మద్దూరు: మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ రహీం కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియామకం అయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. కాంగ్రెస్ పార్టీ, మైనార్టీల బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని రహీం పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహా, నాయకులు సంజీవ్, హుసేన్ పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలీలకు న్యాయం చేయండి



శ్యాసన్‌పల్లిలో కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

నారాయణపేట రూరల్: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల శ్రమదోపిడిని అరికట్టి వారికి తగిన న్యాయం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ డిమాండ్ చేశారు. మండలంలోని శ్యాసన్‌పల్లిలో ఉపాధి పనులను సోమవారం పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, కొలతల రేట్లు పెంచి మూడు రోజులకు రూ.600 కూలీ వచ్చేటట్లు మార్పు చేయాలన్నారు. పెండింగ్ వేతనాలు అందించి, మేటీలకు పారితోషికం ఇవ్వాలని కోరారు. గతంలో 82 రకాల పనులు చేయిస్తుండగా వాటిని కుదించి 22 రకాల పనులు మాత్రమే అనుమతులు ఇస్తున్నారని వాపోయారు. అదేవిధంగా కూలీల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మారుతి, కృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న మిత్రబృందం

మక్తల్: పట్టణానికి చెందిన రవిప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న తోటి మిత్రులు కొంత డబ్బులు జమ చేసుకొని అజాద్ సేవ సమితి ఆధ్వర్యంలో సోమవారం రూ.10 వేల నగదును బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా రవిప్రసాద్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ శేషగిరి, రవి, సురేష్‌గుప్తా, శంకర్, మహిపాల్ రెడ్డి, మల్లికార్జున్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ల దోపిడీని అరికట్టండి



ఏఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

నారాయణపేట: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించిన వరి ధాన్యాన్ని కేటాయించిన మిల్లుల్లో తాలు, తేమ పేరిటా తరుగు తీస్తు దోపిడీకి పాల్పడుతున్నారని సోమవారం రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ నర్సింగ్‌రావు వినతిపత్రాన్ని అందజేశారు. రైతుల వద్ద 41 కిలోల ధాన్యం తూకం చేసి పంపినప్పటికీ మిల్లర్లు మాత్రం తాలు ఉందనే సాకుతో ఒక్కో బస్తాకు అదనంగా మరో కిలో నుంచి రెండు కిలోల వరకు తరుగు తీస్తున్నారన్నారు. సరిపడ గన్నీ బ్యాగులు కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచాలని కోరారు. రైతులు సొంత వాహనాల ద్వారా ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తే రెండు, మూడు రోజులు పాటు పడిగాపులు కాసిన తర్వాత తేమ శాతం అధికంగా ఉందంటూ కోతలు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అశోక్, అంజిలయ్యగౌడ్, వెంకటేష్ ఉన్నారు.

మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత



నర్సరీని పరిశీలిస్తున్న కార్యదర్శి శిల్ప

మక్తల్: మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత అని పంచాయతీ కార్యదర్శి శిల్ప అన్నారు. సోమవారం మండలంలని ముస్తాయిపల్లిలో నర్సరీని ఆమె పరిశీలించారు. అదేవిధంగా ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. సర్పంచ్ వెంకటేశ్, లక్ష్మన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమం ఉధృతం చేస్తాం



దీక్షలో కూర్చున్న గ్రామస్తులు

నారాయణపేట రూరల్: వెనకబడిన కోటకొండపై ప్రభుత్వం చూయిస్తున్న నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ రాబోవు రోజుల్లో మండల సాధన ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని గ్రామస్తులు అన్నారు. మండలంలోని కోటకొండలో నిర్వహిస్తున్న రిలేదీక్షలు 13వ రోజుకు చేరుకున్నాయి. మేకహన్మాన్ తండా ప్రజలు సోమవారం దీక్షలో పాల్గొని మాట్లాడారు. ఎన్టీఆర్ హయాంలోనే కోటకొండ మండలం అయ్యే అవకాశాలు ఉండగా, చైతన్యంలేక వెనకబడ్డారని, ఇప్పుడు ఉద్యమాన్ని ఉధృతం చేసైనా సాధించుకుంటామన్నారు. ఇటీవల కొడంగల్ నియోజకవర్గంలో కొత్తపల్లి, గుండుమాల్‌ను మండలాలుగా ప్రకటించి అన్ని అర్హతలు ఉన్న గ్రామాన్ని విస్మరించడం రాజకీయ దురుద్దేశమేనని విమర్శించారు. ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు తాత్కాలికంగా భవనాలు ఉన్నాయని, కొత్త భవన నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలం ఉందన్నారు. విద్యా, వైద్యం తదితర విషయాల్లో హైస్కూల్, పీహెచ్‌సీలు ఎన్నో ఏళ్లుగా నడుస్తున్నాయని తెలిపారు. వెంటనే ఎమ్మెల్యే చొరువ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి మండలంగా ప్రకటించేలా ఒత్తిడి తీసుకుని రావాలన్నారు. కార్యక్రమంలో గోపాల్‌నాయక్, బాలప్ప, చెన్నప్ప, రాజు, ప్రవీణ్, నర్సింహులు, బీమేష్, రాములు, సుభాష్, సలీం, వెంకట్రాములు, లక్ష్మప్ప, యాదప్ప పాల్గొన్నారు.

అవిశ్వాసానికి అనుమతివ్వాలి



వినతిపత్రం అందిస్తున్న పీఏసీఎస్ డైరెక్టర్లు

నర్వ: మండల పీఏసీఎస్ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానానికి అనుమతివ్వాలని కోరుతూ సోమవారం డీసీఓ కోదండరాంను కోరారు. ఈ సందర్భంగా మొత్తం పీఏసీఎస్‌లో 13 మంది డైరెక్టర్‌లకు 11 మంది సంతకాలు చేసి డీసీఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ లక్ష్మన్న, డైరెక్టర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, లింగన్న, రాములు, పల్లెశేఖర్ ఉన్నారు.

ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం



చెక్కు అందజేస్తున్న శివకుమార్‌రెడ్డి

నారాయణపేట: నియోజకవర్గంలో వివిధ కారణాలతో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని బండగొండ చెందిన కార్యకర్త చాకలి బస్సప్ప మృతి చెందగా, కుటుంబానికి సోమవారం ఆయన పరామర్శించి ఓదార్చారు. వారికి రూ .2 లక్షల పార్టీ బీమా చెక్‌ను అందజేశారు. ఆయన వెంట సదాశివారెడ్డి, గౌస్, కోట్ల రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మరికల్: మండలంలోని కన్మనూర్‌లో శ్రీనివాస్‌గౌడ్‌కు చెందిన గేదెను సోమవారం వ్యవసాయ పొలంలో మేతకు వదిలాడు. అకస్మాత్తుగా ఈదురు గాలుల వర్షానికి విద్యుత్ తీగలు పడ్డాయి. వాటిని తాకి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.70 వేల విలువ ఉంటుందని రైతు తెలిపారు.

ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పిస్తాం

ఊట్కూరు: ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పిస్తామని ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్య కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రహరీ, మరుగుదొడ్లు, నిలిచిన లేబర్ రూం పనులు తదితర విషయాలపై వివిధ శాఖల అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ హనుమంతు, ఎంపీడీఓ కాలప్ప, వైద్యులు సాయిరాం, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మాగనూర్: బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ సుమన్ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ రీజినల్ పరిధిలోని మాగనూర్ బ్రాంచ్‌లో బ్యాంకు మిత్ర సంధ్యారాణి ఆధ్వర్యంలో పాస్‌బుక్ ప్రింటింగ్ ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఖాతాదారుడు డిజిటల్ లావాదేవీలపై దృష్టి సారించాలన్నారు. ఖాతాదారుడు ఏటీఎం నెంబర్, పిన్ నెంబర్, ఓటీపీ నెంబర్‌ను ఇతరులకు చెప్పొద్దన్నారు. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యవసాయ రుణాలు, ఇతరులను సబ్సిడీ రుణాలు సకాలంలో చెల్లించి ప్రభుత్వం అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మక్తల్: మక్తల్ మండలం పంచదేవ్‌పాడులో శ్మశాన వాటికకు ప్రభుత్వం కేటాయించిన భూమిని కాపాడాలని గ్రామస్తులు సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ తిరుపతయ్యకు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి చెందిన కొందరు రైతులు దౌర్జన్యంగా కంచె వేసి ఆక్రమించుకుంటున్నారని పేర్కొన్నారు. 105, 106 సర్వే నంబర్‌లో మూడు ఎకరాల భూమి, 10 గుంటల ఇరిగేషన్ శాఖ భూమిని గ్రామ అభివృద్ధి కోసం కేటాయించారని వివరించారు. ఒక ఎకరా పల్లెప్రకృతి వనానికి, 10 గుంటలు నర్సరీకి, మిగిలిన రెండు ఎకరాలను స్మశాన వాటికకు కేటాయించారని విన్నవించారు. అధికారులు స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు కృష్ణయ్య, రాములు, పెద్దబాలప్ప, గొల్లవీరన్న, ముఖేష, ఆర్ అంజనేయులు, రవూఫ్, వెంకటేశ్, రాజు, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భారత్‌మాల సర్వేకు సహకరించాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్

మాగనూర్: మండల కేంద్రంలోని నల్లగట్టు మారెమ్మవ్వ దేవాలయం దగ్గర నిర్వహిస్తున్న భారత మాల సర్వేకు రైతులు, వ్యాపారులు సహకరించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్ అన్నారు. సోమవారం ఆయన నల్లగట్టు సమీపంలో భారత మాలకు సంబంధించి భూములు కోల్పోతున్న వారి వివరాలను సేకరించడానికి వెళ్లగా అక్కడి రైతులు, వ్యాపారులు నష్ట పరిహారం అభ్యంతరం తెలిపారు. కొందరికి ఎక్కువగా మరికొందరికి తక్కువగా నష్టపరిహారం ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్‌మాలకు మేము వ్యతిరేకం కాదని మాకు సరైన నష్టపరిహారం అందించి వివరాలు సేకరించాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీశైల, ఆర్‌అండ్‌బీ ఏఈ, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఆరోగ్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మరికల్: లేబర్ గుర్తింపు కార్డులు ఉన్న కార్మికుల కుటుంబ సభ్యులకు సోమవారం ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ గోవర్ధన్ ప్రారంభించారు. వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక వైద్య బృందంచే రక్త, మూత్ర పరీక్షలు చేయిస్తుందని తెలిపారు. చెవి, ముక్కు, కంటి సమస్యలతో పాటు ఇతర దీర్ఘకాలిక వ్యాధులను ముందుగానే గుర్తించి రూ.5 లక్షల వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, రాము, గోపి, శ్రీనివాస్, మల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో తెలంగాణ రోల్‌మాడల్



రైతులకు భూమి పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ కోయ శ్రీహర్ష

దామరగిద్ద: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశానికే రోల్ మాడల్‌గా నిలిచిందని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కాన్‌కుర్తిలో కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పల్లె దవఖానా, జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీని వారు ప్రారంభించారు. అనంతరం మహిళా సమాఖ్య భవనం, గ్రంథాలయం భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 126 మంది రైతులకు మంజూరు చేసిన అసైన్డ్ పట్టాలను రైతులకు అందజేశారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. సర్పంచ్ లక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాలుమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలో కేవలం 4,800 ఎకరాలకు మాత్రమే నీళ్లు పారే అవకాశం ఉన్నందున సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. లక్ష్మీపూర్ చెరువు నుంచి లిఫ్ట్ ద్వారా కాన్‌కుర్తిలో రిజర్వాయర్ ఏర్పాటు చేస్తే అన్ని గ్రామాలకు నీరు పారే అవకాశం ఉందని, రిజర్వాయర్ ఏర్పాటుకు అంగీకరించనట్లు తెలిపారు. అసైన్డ్ పట్టాలు వివిధ కారణాలతో కొందరికి అందలేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామకృష్ణ, ఎంపీపీ నర్సప్ప, జెడ్పీటీసీ లావణ్య, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు భీమయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి, రాచప్ప, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో జ్యోతిర్లింగాల ప్రతిష్ఠాపన



పీఠాధిపతులతో భక్తులు

మక్తల్: పట్టణంలో మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం భక్తి శ్రద్ధలతో జ్యోతిర్లింగాలను ప్రతిష్ఠించారు. వేదపండితుడు తిప్పయ్యస్వామి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి శాంతమళ్ళ శివచార్య, మహాస్వామిజీ, పీఠాధిపతి కడుచూర్ గురుమూర్తి శివచార్యలు జ్యోతిర్లింగాలకు అభిషేకాలు చేసి ప్రతిష్ఠించారు. అనంతరం స్వామీజీలను గ్రామస్తులు సన్మానించారు. పీఠాధిపతుల నుంచి భక్తులు ఆశీర్వాదం పొందారు.

ఘనంగా విగ్రహాల శోభాయాత్ర..

ఊట్కూరు: మండల కేంద్రంలోని భవానీ మందిర్‌లో ఈ నెల 25న నవగ్రహాలు, గణపతి, సింహం, తాబేలు తదితర విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఇందులో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ఎస్‌ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో విగ్రహాల శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీరాంనగర్ హనుమాన్ మందిర్ నుంచి ఉదయం 9 గంటలకు గ్రామ పురవీధుల్లో శోభాయాత్ర కొనసాగింది. కార్యక్రమంలో అధ్యక్షుడు చౌదరి అశోక్, నాయకులు తుల్జారాం, చందులాల్, భీంరావు, లక్ష్మన్, గోవిందురావు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పట్టణ 2వ ఎస్‌ఐగా బాధ్యతలు



ఎస్పీతో ఎస్‌ఐ చంద్రశేఖర్

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో రెండవ ఎస్‌ఐగా చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. వికారాబాద్ జిల్లా నుంచి వారం రోజుల క్రితం జిల్లాకు బదిలీపై రాగా అప్పటినుంచి వీఆర్‌లో ఉన్నారు. అయితే జిల్లా కేంద్రం పోలీసు స్టేషన్‌లో పనిభారం ఎక్కువగా ఉండటంతో రెగ్యులర్ ఎస్‌ఐ సురేష్‌తో పాటు ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు ఎస్పీ వెంకటేశ్వర్లును కలిసి విధుల్లో చేరారు.